ఈలలు, చప్పట్లు, కేకలు

# సినిమాలో హాస్యం

"సుబుద్ధి"

మన సినిమాలలో హాస్యానికి ఏ స్థానం వుంది? మన చలన చిత్రాలలో చాలామంది నిర్మాతలు జొప్పించేది అసలైన, సవ్యమైన హాస్యమేనా అనే విషయం పరిశీలించుదాం.

మన చలన చిత్రాల్లో కథకు, పాటలకు, నృత్యాలకు ఎంత ప్రాముఖ్యం యిస్తున్నారో యించుమించుగా అంత ప్రాముఖ్యాన్నీ హాస్యానికి యిస్తున్నారు. అయితే హాస్యమనే పేరుతో అపహాస్యాన్ని ప్రవేశపెట్టి నిర్మాతలు సంతృప్తి చెందుతున్నారు. నీళ్ళపాలు పోసి పాలని భ్రమింపచేయబోయినట్టుగా ఉంది. కాని, నాగరికత,- విజ్ఞానం వున్న యీనాటి ప్రేక్షకులకు నిర్మాతల చేతగానితనం ఏనాడో బోధపడింది. అయినా సవ్యమైన హాస్యంకోసం సహృదయులు ప్రయత్నిస్తేగాని లభించదు. పాటలు, మాటలు వ్రాసే కవీ, దర్శకుడూ, నటుడూ మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తే చక్కని హాస్యాన్ని చిత్రాల్లో ప్రవేశపెట్టవచ్చు. కాని వారే చవకబారు హాస్యాన్ని గాఢంగా వాంఛించేవారైతే మన చిత్రాలలో హాస్యం ఎప్పటికీ యింతే.

తెలుగు చిత్రాల్లో హాస్యం కొంతవరకు పరిశీలించుదాం. ఈనాటి హాస్యం యించుమించుగా లవకుశ చిత్రంలో చాకలి వేషాలతో ప్రారంభమైంది. ఆ రజకదంపతుల శృంగారం అతి సహజంగా, చక్కగా వుంది. రజక దంపతుల దెబ్బలాట, శ్రీరాముణ్ణి దెప్పడం, యివన్నీ ఒకవైపు హాస్యం, వినోదం కలిగించడమే గాకుండా ముఖ్య కథావిధానానికి తోడ్పడేటట్టుగా వున్నాయి. ఆ తరువాత వచ్చిన చిత్రాల్లో ఆ ఫక్కీమీద రాక్షసుల దెబ్బలాటలు, సరసం, గోపకుమారుల దెబ్బలాటలు; ఆటలు, గురుకులంలో వున్న శిష్య సమూహం చిలిపిపనులు యిత్యాదులన్నీ హాస్యానికి ఆధారంగా తీసుకున్నారు గాని, నిర్మాతలు ఆశించిన ప్రయోజనం కలుగలేదు. ఈ పద్ధతిలో పూర్వపు నిర్మాతలు సఫలీకృతులు కాలేదు. కాని 1940లో తీసిన ప్రత్యేక హాస్య చిత్రాలు బారిష్టర్ పార్వతీశం, బొండాం పెళ్ళి హాస్య నిరూపణలో కొత్త పంథా చూపించాయి. ప్రత్యేక హాస్య చిత్రాలుకూడా ప్రజాదరణపొంది, బాగా సొమ్ము చేసుకుంటాయని నిర్మాతలు, ప్రేక్షకులు గ్రహించారు. కాని ఆటుతర్వాత ఆపంథా తొక్కిన వారెవరూ యిక లేరు. ఆ ఉత్సాహం, ఆ మార్గం అంతటితో నశించాయి.

రానురాను మన చిత్రాల్లో హాస్యం చవకబారు అవడమే కాకుండా, హాస్యంకోసం పేలవంగా వున్న ప్రత్యేక సన్నివేశాలు కల్పించడం, ఉపకథలు సృష్టించడం, అందులో ముఖ్యంగా అబ్బాయి, అమ్మాయి (వయస్సు చెరో నలభై) సన్నివేశాలు ఎక్కువయినాయి. వాళ్ళ మాట్లాడేది ద్వందార్థం యిచ్చే బూతులు. బూతుల్లో హాస్యం వుందని దృఢంగా నమ్మే చిత్ర నిర్మాతలు ప్రేక్షకుల నెత్తిన సెన్సారు కళ్ళుగప్పి బలవంతాన్ని ముతక హాస్యం రుద్దదలుచుకున్నారన్నమాట. ఇటువంటి హాస్యం అనబడేదాన్ని చూసి ప్రేక్షకులు నవ్వినా, చప్పట్లుకొట్టినా, చిత్ర నిర్మాతల అమాయకత్వానికీ, చేతగానితనానికేగాని, ఆ హాస్యం అనబడేదానికి కాదు.

మన తెలుగు భాషలో అన్ని యితర భాషలలోలాగే హాస్యానికి చాలా అవకాశం వుంది. అయితే సినిమాల్లో హాస్యం భాషలో యిమిడి వున్నదా, లేక నటుల్ని అష్టవంకరలుగా తిప్పి వికారపు చేష్టలద్వారా ప్రేక్షకులను నవ్విస్తున్నారా అనేదే ప్రశ్న. చాలామంది చిత్ర నిర్మాతలు హాస్యాన్ని నటులయొక్క వికారపు చేష్టలవల్ల, ద్వందార్థం యిచ్చే మాటల ద్వారా ప్రవేశపెడుతున్నా మనుకోవడం వట్టి భ్రమ; ఆత్మవంచన. పైగా ఎవరైనా విమర్శకులు 'యిదేనా హాస్యం' అని ప్రశ్నిస్తే, నిబ్బరంగా 'అదే హాస్యమంటే, మా ప్రేక్షకులకు యీ రకం

హాస్యమే కావాలి' అని ప్రేక్షకుల్ని అపహాస్యం చేస్తున్నారు. మొండిగా అదే రకపు చెత్తహాస్యాన్ని తరువాత ఫిల్ములలో యిరికిస్తున్నారు. ఈ అవమానాన్ని, మొండితనాన్ని అభిమానమున్న ఏ ప్రేక్షకుడూ సహించడు.

నాగరికత, విజ్ఞానం వున్న యీనాటి ప్రేక్షకుడు 'మీరు తీసేది చెత్త, మీరు చూపేది తుక్కు' అని అంటూవుంటే, నిర్మాతలు 'కాదు, మీకు యిలాటిదే కావాలి; మీ విజ్ఞానం దీన్నే మెచ్చుకుంటుంది, అనటం ఎంత మొండిగా, చేతగానితనాన్ని నిరూపించేదిగా వుందో సులభంగా గ్రహించవచ్చు. అంతకంటె "మేము యింత కంటె బాగా తియ్యలేము, మమ్మల్ని క్షమించండి" అంటే కొంత బాగుంటుంది.

అసలైన హాస్యం వింటే మనస్సు ఉప్పొంగుతుంది. ఆమాటలు తరిమి తరిమి నవ్విస్తాయి. అయితే చేష్టలు లేకుండా ఒక్క మాటలవల్లనే హాస్యం అన్ని వేళలా ఉద్భవిస్తుందని నేను అనను. భాషలో వున్న హాస్యాన్ని సక్రమమైన చేష్టలు యినుమడింప చేస్తాయి. అదే వికారపు తిరుగుళ్ళయితే హాస్యానికి బదులు అసహ్యంగా వుంటాయి.

స్వర్గసీమలో శివరావు, లింగమూర్తి, నారాయణరావు అత్యద్భుతమైన హాస్యాన్నిచ్చారు. శివరావు 'యిద్దరికీ గుడ్‌మార్నింగ్ సార్, ఇద్దరికీ గుడ్‌మార్నింగ్ సార్' అనడం, లింగమూర్తి 'అమ్మా తమ పేరు, వెధవది అస్తమానం మర్చిపోతున్నా' అనడం, అలాగే 'బాబూ యీ మిసన అమెరికాయలో గొన్నారా?' అనడం యివన్నీ హాస్యానికి మచ్చుతునకలు. శివరావు స్వర్గసీమకు పూర్వం రెండు, మూడు చిత్రాల్లో హాస్యనటుడుగా నటించినా, స్వర్గసీమలో శివరావును నిర్మాతలు ఉపయోగించుకున్నట్లుగా యితర నిర్మాతలు ఉపయోగించుకో లేకపోయారు.

యోగి వేమనలో అభిరామయ్యగా, నూనె గుడ్డలవాడుగా లింగమూర్తి ఎంతో హాస్యాన్ని, ఆ చేత్తోనే హుందాతనాన్ని అందించాడు. వేమన చిత్రంలో వేశ్యమాత నటన, మాటలు చాలా సహజమైన హాస్యం కలుగజేశాయి. బాలరాజు చిత్రంలో శివరావు గొల్ల హాస్యం అతి సహజంగా, మోతాదుగా వుంది. మళ్ళీ ద్రోహి, రక్షరేఖ, లైలామజ్నూ చిత్రాల్లో శివరావు హాస్యం మొహంమొత్తి అసహ్యం వేసింది. గుణసుందరి కథలో శివరావు హాస్యం అక్కడక్కడ మితం తప్పినా చాలామట్టుకు సహజంగా వుంది. కాబట్టి హాస్యమైనా దర్శకుణ్ణి బట్టి, కథనిబట్టి వుంటుందనే విషయం తేలిపోయింది. వారిద్దరూ ప్రయత్నిస్తే హాస్యాన్ని ఎంతో సహజంగా, సభ్యంగా చిత్రాల్లో పోషించవచ్చు.

మితంతప్పి, వెగటుకల్గించి అపహాస్యం అయినవి కీలుగుర్రంలో రేలంగి-కనకం, మనదేశంలో రేలంగి-లక్ష్మీకాంతం, వంకర, వాలిసుగ్రీవులలో రేలంగి, బాల సరస్వతి వగైరా నటించిన అసభ్య సన్నివేశాలు. ఉదాహరణగా ఎన్నైనా యివ్వవచ్చును. హాస్యంలో వికారం లేకుండా, హుందాతనం, సభ్యత, సరసతతో తీసిన చిత్రాలు చాలా తక్కువ.

అరవచిత్రాల్లో అపహాస్యానికి పేరుమోసిన వారు కృష్ణన్, మధురం, కాళీ యన్. రత్నం. ఒకమాదిరి మంచి హాస్యాన్నివ్వ గలిగినవారు సారంగపాణి, టి. ఆర్. రామచంద్రన్. అరవ చిత్రాల్లో అపహాస్యాన్ని ఎత్తి మాపవక్కర లేదు. కథతో సంబంధం వున్నా లేకపోయినా కృష్ణన్ మధురం ఎలాగో ఒకలాగ యిరికించబడుతారు. వాళ్ళకోసం అధమం [illegible],000 అడుగుల సెల్యులాయిడ్ దుబారా ఖర్చు చేయబడుతుంది. అరవ చిత్రాల్లో హాస్యం, ఆ భాషలాగే మరీ మోటుగా వుంటుంది.

హిందీ సినిమాలలో పూర్వం ఛార్లీ నకలుగా కనిపించేవాడు. ప్రేక్షకులను బలవంతానైనా నవ్వించటానికి ఛార్లీ పడిన్నన్ని వికారాలు, బాధలు సర్కస్‌లో బఫూన్ కూడా పడడని నా నమ్మకం. మన అదృష్టవశాత్తు ఛార్లీ రోజులు పోయాయి. మన దురదృష్టవశాత్తు వి. హెచ్. దేశాయి, దీక్షిత్ చనిపోయారు. ఏనాటికైనా మన భారతీయ చలన చిత్రరంగంలో, లారెల్-హార్డీ; బాబ్‌హోప్, మిక్కీరూనీ వంటి హాస్య నటులు బయలుదేరి సభ్యతలో కూడా సహజ హాస్యరసాన్ని అందించాలని మనం మనసారా వాంఛించుదాం. అంతకంటే ఏం చెయ్యగలం?